పాఠశాల ఎన్నికలకు రాజకీయ రంగు

నేడు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు

- కమిటీ సభ్యులకు రెండేళ్ల పదవీ కాలం
- ఇప్పటికే ఓటరు జాబితాను ప్రకటించిన ఉపాధ్యాయులు
- ఎన్నికల్లో రాజకీయ జోక్యం
- టీడీపీ సానుభూతిపరులే ఉండేలా పావులు

ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలు గురువారం ప్రారంభం కానున్నాయి. అయితే రాజకీయాలకు దూరంగా నిర్వహించాల్సిన ఎస్ఎంసీ ఎన్నికలకు టీడీపీ నేతలు రాజకీయ రంగు పూస్తున్నారు. అధికార పార్టీకి చెందిన నాయకులు, సానుభూతి పరులే కమిటీలో ఉండేలా పావులు కదుపుతున్నారు. పాఠశాలల వారీగా ఎవరెవరు చైర్మన్, వైస్ చైర్మన్‌లు ఉండాలని ఇప్పటికే జాబితా సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. తల్లిదండ్రుల సమక్షంలో జరగాల్సిన ఎన్నికలు కాస్త అధికార పార్టీ నాయకుల పెత్తనంతో రాజకీయ ఎన్నికలుగా మారాయి.

కొలిమిగుండ్ల/డోన్ రూరల్: డోన్, బనగానపల్లె నియోజకవర్గాల్లోని పాఠశాలల్లో గురువారం జరగనున్న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలను టీడీపీ నాయకులు రాజకీయ ఎన్నికలుగా మార్చేస్తున్నారు. స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికల్లో రాజకీయ జోక్యం ఉండరాదు. కాని కూటమి ప్రభుత్వంలోని నాయకులు రాజకీయాలకు పూర్తి దూరంగా నిర్వహించాల్సిన పాఠశాలల స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికల్లో జోక్యం చేసుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో పట్టు సాధించేందుకు కూటమి నేతలు ఈ ఎన్నికలపై ప్రధానంగా దృష్టి సారించారు. తమ పార్టీకి చెందిన నాయకులు, సానుభూతి పరులు మాత్రమే ఉండేలా రాజకీయం చేస్తున్నారు. మరోపక్క అధికార పార్టీలో కొన్ని చోట్ల అసంతృప్తులు నెలకొన్నట్లు తెలుస్తోంది. తమ మద్దతుదారులే ఉండాలని ఇరు వర్గాలు పట్టుబడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ప్రశాంతంగా కొన్ని పాఠశాలల్లో పోటీ నెలకొనే అవకాశం ఉండడంతో విద్యాశాఖ అధికారులు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులను కోరారు.

ఎన్నికల అధికారిగా హెచ్ఎంలు



కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాల

స్కూల్ కమిటీ ఎన్నికల్లో హెచ్ఎంలు ఎన్నికల అధికారిగా వ్యవహరించనున్నారు. తహసీల్దార్, ఎంపీడీఓ, వీఆర్ఓలు పరిశీలకులుగా ఉంటారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లితండ్రులు మాత్రమే ఈ ఎన్నికల్లో పోటీ చేయాల్సి ఉంటుంది. కనీసం 50 శాతం తల్లితండ్రులు హాజరు కావాల్సి ఉంటుంది. ఇందులో తల్లిలేక తండ్రి మాత్రమే పాల్గొనాల్సి ఉంటుంది. 8వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటలోపు సభ్యులతో పాటు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహిస్తారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు కమిటీ తొలి సమావేశం నిర్వహిస్తారు. ప్రతి సభ్యుడికి రెండేళ్ల పదవీకాలం ఉంటుంది.

ఎన్నికల నిర్వహణ ఇలా..

పాఠశాలల్లో సెక్షన్లు, మీడియంతో సంబంధం లేకుండా తరగతిని యూనిట్‌గా తీసుకొని ముగ్గురు సభ్యులను ఎన్నుకోవాలి. వీరిలో ఇద్దరు మహిళలు తప్పనిసరి. ముగ్గురిలో ఒకరు తప్పకుండా ఎస్సీ, ఎస్టీ, విభిన్న ప్రతిభావంతులు, మరొకరు బీసీ, ఈబీసీ, మైనార్టీకి చెందిన వారై ఉండాలి. తరగతి నుంచి సభ్యుల ఎన్నికకు 50 వాతం ఓటర్ల హాజరును రిజిస్టర్‌లో చూపిన తరువాతనే ఎన్నిక జరపాలి. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు కూడా 50 శాతం సభ్యుల హాజరు ఉండాలి. తరగతుల వారిగా ఎన్నికైన సభ్యులందరూ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలో సభ్యులుగా ఉంటారు. వీరంతా చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. ఒకవేళ ఆరుగురు విద్యార్థులు లేకపోతే మరో తరగతిలో విలీనం చేసి ఎన్నుకోవాలి.

గత ప్రభుత్వంలో కమిటీలకు పెద్దపీట

గత ప్రభుత్వంలో స్కూల్ కమిటీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. నాడు-నేడు పనులు కమిటీ సభ్యులకే అప్పగించారు. దీంతో నాడు-నేడు పనులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా జరిగాయి. ప్రతి నెలా సమావేశం నిర్వహించి విద్యార్థుల పురోగతి, పాఠశాల అభివృద్ధి పనులపై సమీక్షించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకునేవారు. ఈ ఏడాది ప్రభుత్వం మారడంతో కూటమి పార్టీల నాయకులు పాఠశాల ఎన్నికలపై దృష్టి సారించారు. టీడీపీకి చెందిన వారినే చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకోవాలని ప్రయత్నాలు సాగుతున్నాయి.

డోన్ నియోజకవర్గంలో పాఠశాలల వివరాలు

మండలం	పాఠశాలలు
డోన్	79
బేతంచెర్ల	54
ప్యాపిలి	64

బనగానపల్లె నియోజకవర్గంలో..

మండలం	పాఠశాలలు
బనగానపల్లె	79
కోవెలకుంట్ల	36
కొలిమిగుండ్ల	59
సంజామల	41
అవుకు	49

అన్ని ఏర్పాట్లు చేశాం

కొలిమిగుండ్ల మండలంలో స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులకు ఎన్నికలపై అవగాహన కల్పించాం. ప్రశాంతంగా ఎన్నికలు జరిపించేందుకు చర్యలు తీసుకున్నాం.

–అబ్దుల్ కలాం, ఎంఈఓ, కొలిమిగుండ్ల

సజావుగా నిర్వహిస్తాం



డోన్ మండల వ్యాప్తంగా 79 ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం పాఠశాల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే ఆయా గ్రామాల పాఠశాల నోటీస్ బోర్డులో ఓటరు జాబితా ప్రదర్శించాం. ఓటరు జాబితాపై అభ్యంతరాలు కూడా స్వీకరించాం. ఆయా గ్రామాల్లో విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో స్కూల్ కమిటీ ఎన్నికలు నిర్వహిస్తున్నాం.

–ప్రభాకర్, ఎంఈఓ, డోన్

క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి అబ్దుల్ రహిమాన్

కోవెలకుంట్ల: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కోవెలకుంట్ల జూనియర్ సివిల్ కోర్టు జడ్జి అబ్దుల్ రహిమాన్ సూచించారు. హైకోర్టు ఆదేశాల మేరకు బుధవారం పట్టణంలోని సనా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిషేధిత చట్టం, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, తదితర చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. ప్రస్తుతం అమలవుతున్న వివిధ చట్టాల్లోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా తెలుసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ జయచంద్ర, సెబ్ సీఐ వర్ధనాదేవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి ఓబులేసు, న్యాయవాదులు మల్లికార్జున రెడ్డి, తిరుపాలు, నరసింహులు, శ్రీకాంత్, నాగశేషు,కంబగిరి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతికి నివాళి

కొలిమిగుండ్ల: కల్వటాల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత సిరిపి పుల్లారెడ్డి(65) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎర్రబోతుల ఉదయ్ భాస్కర్‌రెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. కాగా నెల క్రితం పుల్లారెడ్డి భార్య జయమ్మ మృతిచెందింది.

పంట నమోదు తప్పనిసరి



హెచ్ కొట్టాల గ్రామంలో పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ

బేతంచెర్ల: మండలంలో ఖరీఫ్ పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని ఏఓ కిరణ్ కుమార్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని హెచ్ కొట్టాల రైతు సేవా కేంద్రంతో పాటు పంట పొలంలో ఈ-పంట యాప్ ద్వారా జరుగుతున్న పంట నమోదు కార్యాక్రమాన్ని ఏఓ పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని రైతులు పట్టదారు పాసుపుస్తకం, ఆధార్, బ్యాంక్ అకౌంట్ వివరాలు అందజేసి పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. ఆయన వెంట అగ్రికల్చర్ అసిస్టెంట్ వేణు, ఏఈఓ మధు ఉన్నారు.

స్వదేశీ పరిశ్రమలను ప్రోత్సహించాలి



సంప్రదాయ దుస్తులు ధరించిన అధ్యాపకులు, విద్యార్థులు

కోవెలకుంట్ల: స్వదేశీ పరిశ్రమలను ప్రోత్సహించి భారత ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందించాలని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ సూచించారు. పట్టణంలోని వాసవీ బొమ్మిదాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు స్వదేశీ సంప్రదాయ దుస్తులను ధరించి కళాశాలకు హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశ లంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రజలు దేశంలో తయారైన వస్తువులను వినియోగించాలని పేర్కొన్నారు. బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారతీయులు చేపట్టిన జాతీయ ఉద్యమకాలం నాటి స్వదేశీ ఉద్యమ ప్రాముఖ్యత, దేశంలో చేనేత రంగానికి ప్రాచీన కాలం నుంచి ఉన్న ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటేశ్వరరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, నాగేశ్వరరెడ్డి, లక్ష్మీదేవి, అన్నపూర్ణ, కృష్ణదాసు, చంటిరెడ్డి, సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

దాడి కేసు నమోదు

బేతంచెర్ల: నగదు లావాదేవీల విషయంలో తలెత్తిన వివాదంలో వ్యక్తిపై దాడి చేసిన ఘటన మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన తెలుగు వెంకటేశ్వరమ్మ తన చిప్స్ ఫ్యాక్టరీని అదే గ్రామానికి చెందిన సయ్యద్ మహమ్మద్ గౌస్‌కు లీజుకు ఇచ్చారు. లీజు డబ్బుల విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. సయ్యద్ మహమ్మద్ గౌస్‌పై తెలుగు వెంకటేశ్వరమ్మ, ఆమె కుమారుడు శివ రంజన్ దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రమణ తెలిపారు.

బనగానపల్లెలో 24.4 మి.మీ వర్షపాతం

బనగానపల్లె: బనగానపల్లె పరిసర ప్రాంతాల్లో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు 24.4 మి.మీ వర్షపాతం నమోదైంది. మొక్కజొన్న, మిరప, కంది పంటలకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

హౌసింగ్ బిల్లుల ప్రతిపాదనలు పంపండి

సంజామల: జగనన్న కాలనీలతో పాటు సొంత స్థలాల్లో ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారుల బిల్లుల ప్రతిపాదనలను పంపాలని ఎంపీడీఓ విజయకుమార్ రెడ్డి అన్నారు. సంజామల మండ ప్రజాపరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్స్, ఫిల్డ్ అసిస్టెంట్స్‌లతో బుధవారం సమీక్షించారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద మంజూరు అయ్యో హౌసింగ్ బిల్లుల ప్రతిపాదనలు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఏపీఓ ప్రకాష్ రావు, హౌసింగ్ ఏఈ బాలచంద్రుడు పాల్గొన్నారు.



ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ విజయకుమార్ రెడ్డి

ముర్రుపాలే బిడ్డకు శ్రీరామరక్ష

బేతంచెర్ల: ముర్రుపాలు బిడ్డకు మొదటి వ్యాధి నిరోధక టీకాగా పనిచేస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తిప్పమ్మ, రాధమ్మ అన్నారు. బుధవారం పట్టణంలోని 5వ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాన్ని నిర్వహించారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి 6 నెలల వరకు కేవలం తల్లి పాలు మాత్రమే తాగించాలని తెలిపారు. దీని వల్ల బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని చెప్పారు. 7వ నెల నుంచి తల్లి పాలతోపాటు అనుబంధ పోషకాహారాన్ని ఇస్తూ, తల్లి పాలను రెండేళ్ల వరకు కొనసాగించాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సంతోషమ్మ, అనూష పాల్గొన్నారు.



తల్లిపాల వారోత్సవ ర్యాలీలో ఐసీడీఎస్ సిబ్బంది

తపాలా పథకాలపై అవగాహన

బేతంచెర్ల: తపాలా శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు ఈస్ట్ తపాలా శాఖ ఇన్‌స్పెక్టర్ స్వామి నాయక్ అన్నారు. బుధవారం సబ్ పోస్టుమాస్టర్ నరసింహులు, సిబ్బంది పట్టణంలోని తపాలా కార్యాలయం నుంచి పాతబస్టాండ్, కొత్త బస్టాండ్ వరకు జనంలోకి మనం కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. బాలికలకు అండగా నిలిచే సుకన్య సమృద్ధి యోజన, బీమా పాలసీలు, వివిధ పోస్టల్ పథకాలపై అవగాహన కల్పించారు. బ్రాంచ్ పోస్టు మాస్టర్లు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, మదన క్రిష్టారెడ్డి, రమేష్, మధు శివ రామయ్య, శేఖర్ నాయక్, రవి పాల్గొన్నారు.



బేతంచెర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న తపాలా సిబ్బంది

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

బనగానపల్లె రూరల్: మండలంలోని నందివర్గం గ్రామంలో ఉన్న చేనేత సహకార సంఘం కార్యాలయంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా చేనేత జౌళి శాఖ అసిస్టెంట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు సత్యంబాబు, కాంతరావు మాట్లాడుతూ.. చేనేత, జౌళి సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం రాయితీలు ఇస్తోందని తెలిపారు. చేనేత కార్మికులకు 90 శాతం సబ్సిడీతో మగ్గాలు, విడిభాగాలు కొనుగోలకు రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. నందివర్గం చేనేత సహకార సంఘం సొసైటీ పరిధిలోని కార్మికులకు త్వరలోనే సబ్సిడీ పరికరాలు అందజేస్తామని తెలిపారు. అనంతరం సొసైటీలో సీనియర్ చేనేత కార్మికులు యాదటి మద్దయ్య, బందా నాగేశ్వరావును సన్మానించారు. సహకార సంఘం ఇన్‌చార్జి ఆఫీసర్ నరసింహారెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్లు శ్యామలదేవి, విజయకుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా చేనేత జౌళి శాఖ అసిస్టెంట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సత్యంబాబు

దాడిలో గాయపడిన వ్యక్తి మృతి



మాదయ్య (ఫైల్)

డోన్ టౌన్: పొలం గట్టు విషయంలో నెల క్రితం దాడిలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. వివరాలు.. వెంకటనాయునిపల్లె గ్రామానికి చెందిన మారబోయిన మాదయ్య(45)కు బోయ చెన్నయ్య నాయుడు, ఇంద్రప్రకాష్ నాయుడు మధ్య కొంత కాలంగా పొలం గట్టు విషయంలో వివాదం నడుస్తోంది. జూలై 7వ తేదీ మాదయ్యపై నిందితులు కొడవళ్లు, కర్రలతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన మాదయ్యను చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. నిందితులు బోయ చెన్నయ్య నాయుడు, ఇంద్ర ప్రకాష్‌నాయుడు, ప్రభాకర్ నాయుడు, రంగన్న నాయుడు, సురేష్‌నాయుడు, వెంకటరమణమ్మ, మహేశ్వరి, లక్ష్మీదేవి, సుభాషిణిలపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. మాదయ్య పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు తొమ్మిది మందిపై హత్య కేసుగా మార్పు చేసినట్లు పోలీసులు తెలిపారు. రూరల్ సీఐ అస్రత్‌బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మాదయ్య మృతితో గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎస్సీ వర్గీకరణతో మాలలకు అన్యాయం

బనగానపల్లె రూరల్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో మాలలకు తీవ్ర అన్యాయం జరిగిందని రాష్ట్ర మాలమహానాడు ఉపాధ్యక్షుడు దస్తగిరి అన్నారు. బుధవారం పట్టణంలోని అవుకుమెట్ట సర్కిల్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. వర్గీకరణ విషయంలో మాలలకు అన్యాయం జరిగితే రాజకీయ నాయకులకు భవిష్యత్తు ఉండదన్నారు. మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, నాయకులు బెలుం వెంకట సుబ్బయ్య, బండల స్వామిదాస్, జయరాముడు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ప్యాపిలి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో 100 మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నవీనపాటి, అధ్యాపకులు రామకృష్ణయ్య, నవీన్, సత్యబాబు, వెంకటరమణ, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఖాదర్ వలి జియారత్



పేరుసోములలో ఖాదర్‌వలి స్వామి

సంజామల: మండల పరిధిలోని పేరుసోముల గ్రామంలో ఖాదర్ వలి, రెడ్డిపల్లె గ్రామంలో మౌలాలిస్వామి జియారత్ వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక ఫాతేహాలు సమర్పించి ముక్కులు చెల్లించుకున్నారు. అర్ధరాత్రి నుంచి స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు.

రైలులో చత్తీస్‌గఢ్ వాసి మృతి



మృతుడు దేవేంద్రకుమార్

డోన్ రూరల్: చత్తీస్‌గఢ్‌కు చెందిన దేవేంద్రకుమార్(44) బుధవారం యశ్వంత్‌పూర్ నుంచి కోరబా వెళ్లే రైలులో మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. అతని వద్ద ధర్మవరం నుంచి గోండియాకు జనరల్ టికెట్ ఉందన్నారు. వ్యక్తి అనుమానాస్పదంగా పడి ఉండడాన్ని చూసి తోటి ప్రయాణికులు సమాచారం ఇవ్వడంతో డోన్ రైల్వే స్టేషన్‌కు రైలు రాగానే వెళ్లి పరిశీలించామన్నారు. అతను అప్పటికే మృతి చెంది ఉన్నాడని.. మొబైల్, ఆధార్ కార్డు ఆధారంగా వారి బంధువులకు సమాచారం అందించామని తెలిపారు. మృతదేహాన్ని డోన్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఉంచామన్నారు. మృతికి గల కారాణాలు తెలియాల్సి ఉందని పేర్కొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేద్దాం

కోవెలకుంట్ల: నంద్యాలలో ఈ నెల 9వ తేదీ నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని జాతీయ గిరిజన భవిష్యత్ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కాండ్లావత్ శ్రీనివాస నాయక్ అన్నారు. బుధవారం కోవెలకుంట్లలో విలేకరులతో మాట్లాడుతూ.. జెనీవాలో జరిగిన ఐక్యరాజ్య సమితి ప్రత్యేక సమావేశంలో ఆగస్టు 9న అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని జరుపుకోవాలని తీర్మానించారన్నారు.అప్పటి నుంచి ఏటా ఆదివాసీదినోత్సవాన్ని జరుపుతున్నారని తెలిపారు. శుక్రవారం జరిగే కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, గిరిజన ఉద్యోగులు, ప్రజా సంఘాల ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించండి

ప్యాపిలి: ఇంటింటి సర్వే నిర్వహించి కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించాలని జాయింట్ డైరెక్టర్ దేవసాగర్ అన్నారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కుష్టు వ్యాధి సర్వే నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారిని వెంటనే పీహెచ్‌సీకి రెఫర్ చేయాలన్నారు. న్యూక్లియస్ వైద్యాధికారి తేజశ్విని, వైద్యాధికారులు మల్లికార్జునరెడ్డి, నితీశ్, రామచంద్రారెడ్డి, విజయకుమారి, మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పంట నమోదు

డోన్ రూరల్: గ్రామాల్లో పంట నమోదును పకడ్బందీగా నిర్వహించాలని ఏడీఏ పి.అశోక్‌వర్ధన్‌రెడ్డి వ్యవసాయ సహాయకులను ఆదేశించారు.బుధవారం డోన్ వ్యవసాయ కార్యాలయంలో మండలంలోని అగ్రికల్చర్ అసిస్టెంట్లకు ఖరీఫ్‌లో పంటనమోదుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.పంట నమోదుపై రైతులకు అందుబాటులో ఉంటూ ఎప్ప టికప్పుడు పంటల సాగుపై సలహాలు ఇవ్వాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి అబ్దుల్‌షఫీ ఉన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ అశోక్‌వర్ధన్‌రెడ్డి

నేడు పోతుదొడ్డికి మాజీ మంత్రి బుగ్గన

ప్యాపిలి: మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి గురువారం పోతుదొడ్డి గ్రామానికి రానున్నట్లు వైఎస్సార్‌సీపీ నేతలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 13వ తేదీ పోతుదొడ్డిలో టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణమూర్తి, రామరంగడు, శేషు, ఆదినారాయణను బుగ్గన పరామర్శించనున్నారు.

బేతంచెర్ల: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి గురువారం సాయంత్రం 4 గంటల నుంచి అందుబాటులో ఉంటారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి తెలిపారు.

తహసీల్దార్ వచ్చేనా?

కొలిమిగుండ్ల: ఎన్నికల సమయంలో ఇతర జిల్లాల నుంచి నియమించిన తహసీల్దార్లు ఇటీవలే రిలీవ్ కావడంతో చాలా చోట్ల వారి స్థానంలో తహసీల్దార్లను నియమించారు. కొలిమిగుండ్ల తహసీల్దార్‌గా ఇప్పటి వరకు ఎవరిని నియమించలేదు. తహసీల్దార్ సునీతబాయి జూలై 24న ఇక్కడి నుంచి రిలీవ్ అయిపోయి అనంతపురంలో రిపోర్టు చేసుకున్నారు. అప్పటి నుంచి సుమారు 13 రోజులు అవుతున్నా ఇక్కడ తహసీల్దార్ పోస్టు భర్తీ కావడం లేదు. గతంలో కొలిమిగుండ్ల తహసీల్దార్ పోస్టుకు ఆశావాహుల సంఖ్య ఎక్కువగానే ఉండేది. నాయకుల సిఫారసు లేఖల కోసం పలుమార్లు తిరిగేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇక్కడ మాత్రం పరిస్థితులు మారిపోయాయి. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న మండలంలో మండల మెజిస్ట్రేట్ లేకపోవడంతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతానికి డీటీ నాగేశ్వరరెడ్డికి తాత్కాలిక ఇన్‌చార్జ్ బాధ్యతలు మాత్రమే అప్పగించారు. నామ మాత్రపు పనులు తప్ప భూముల వ్యవహారాలు, కోర్టు కేసులు, సర్వే తదితర అంశాల్లో చొరవ చూపడం లేదు. మొదట్లో ఒకరిద్దరి పేర్లు బలంగా వినిపించినా చివరకు ఎవరూ ముందుకు రావడం లేదని తెలుస్తోంది. రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమిస్తారా లేక ఇతర మండలానికి చెందిన తహసీల్దార్‌ను ఇన్‌చార్జ్‌గా నియమిస్తారా అనే చర్చ మండల ప్రజల్లో నెలకొంది.



తహసీల్దార్ కార్యాలయం

భారీ వర్షంతో నీట మునిగిన పంటలు





రేవనూరులో నీట మునిగిన జనుము పంట, సాదరదిన్నెలో బెండ, జొన్న పంటలో చేరిన వర్షపునీరు

కోవెలకుంట్ల: స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని ఆయా మండలాల్లో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షంతో పలు ప్రాంతాల్లో పంటలు నీటమునిగాయి. దొర్నిపాడు మండలంలో అత్యధికంగా 30.2 మి.మీ, కోవెలకుంట్లలో 27.4 మి.మీ, అవుకులో 12.4 మి.మీ, సంజామలలో 10.8 మి.మీ, కొలిమిగుండ్ల మండలంలో 6.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆయా మండలాల వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. భారీ వర్షంతో పలు చోట్ల పంటలు దెబ్బతిన్నాయి. పంటపొలాలు చెరువులను తలపిస్తున్నాయి. పొలాల్లో భారీగా వర్షపునీరు నిల్వ చేరడంతో పంటలు సాగు చేసుకునేందుకు అడ్డంకిగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.